క్లుప్తంగా

దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: హైరిస్క్ మలేరియా గ్రామాల్లో దోమల నివారణ మందును విస్తృతంగా పిచికారీ చేయాలని మలేరియా నివారణ శాఖ సబ్‌యూనిట్ ఆఫీసర్ జె. మోహనరావు అన్నారు. మండలంలోని దుగ్గి, కొత్తవలస, పెద్దపొల్ల గ్రామాల్లో ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని పిచికారీ చేయడాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

పాలకొండ: మండలంలో ఎవరైనా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వరహాలు హెచ్చరించారు. మండలంలోని మంగళాపురం, గోపాలపురం గ్రామాల్లోని నాగావళి నదీ తీరప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణాపై వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముగిసిన గ్రామదేవత సంబరాలు

భామిని: మండలంలోని గజపతినగరం గ్రామంలో గ్రామదేవత సంబరాలు బుధవారంతో ముగిశాయి. ఐదు రోజులుగా సంప్రదాయబద్ధంగా గ్రామదేవత ఘటాలు, పాలజంగిడిలకు పూజలు నిర్వహించారు. బంధువులతో ప్రతి ఇల్లూ కళకళలాడింది.

అందుబాటులో పుస్తకాలు



కాంపిటేటివ్ పుస్తకాలు

భామిని: వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉన్నాయని గ్రంథాలయాధికారి ఎ. సునీత తెలిపారు. ఈ మేరకు కాంపిటేటివ్ బుక్స్, ఇతర పరీక్షల మెటీరియల్ వివరాలను వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తున్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహ స్వామి జయంతి



లక్ష్మీనృసింహస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సీతానగరం: సువర్ణముఖీనదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు సీహెచ్ గోపాలకృష్ణ కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం వైభవంగా సాగాయి. అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. లోక కల్యాణార్థం ఏటా స్వామివారి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యాగ పూజలు, అభిషేకాల్లో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సాలూరు: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సాలూరు పట్టణ సీఐ వాసునాయుడు హెచ్చరించారు. పట్టణంలోని అక్కేనవీధి రామమందిరం వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 4వ తేదీ వరకు పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సోషల్ మీడియా, బయట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టణంలో ఏ విధమైన ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు.

శాంతియుత జీవనం శ్రేయస్కరం

- ఓట్లు లెక్కింపు వరకు గ్రామాల్లో 144 సెక్షన్ అమలు



సుమిత్రాపురంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజేష్

సీతానగరం: గ్రామీణ ప్రజలు శాంతియుతంగా మెలగాలని, ఓట్లు లెక్కింపు వరకు మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ ఎం.రాజేష్ తెలిపారు. పెదంకలాం, సుమిత్రాపురం గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిందని, వాటికోసం వాగ్వాదాలు, గొడవలు పడి కుటుంబాల ఐక్యతను దెబ్బతీసుకోవద్దన్నారు. స్నేహపూర్వంగా మెలగాలని సూచించారు. వివాదాస్పద వ్యక్తులపై నిఘా ఉంచామని, అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇనాం భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం..

- పదేళ్లుగా ఎమ్మెల్యే కళావతి చేసిన కృషికి దక్కిన ఫలితం
- 1300 ఎకరాలకు హక్కుదారులు కానున్న 350 మంది రైతులు
- జగనన్న భూహక్కు– భూరక్ష పథకంతో సత్ఫలితాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



వండువ రెవెన్యూ పరిధిలో ఉన్న రైతులు

వీరఘట్టం: వందేళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వల్ల పరిష్కారం లభించింది. జగనన్న భూహక్కు – భూరక్ష చట్టంతో శాశ్వత పరిష్కారం లభించడంతో వండవ గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వండవ గ్రామ రెవెన్యూ పరిధిలో గల భూములు వందేళ్లుగా రైతుల సాగులో ఉన్నాయి. ప్రతి ఏటా సాగు చేసుకుంటూ ఫలసాయం అనుభవిస్తున్నారు. అయినప్పటికీ ఏ ఒక్క రైతుకు కూడా తాము సాగు చేస్తున్న భూములపై ఇంతవరకు హక్కు పత్రాలు లేవు. ఎందుకంటే ఈ భూములన్నీ ఇనాం భూములుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉండడంతో ఈ భూములు అమ్మేందుకు గాని, రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గాని వీలుకాని పరిస్థితి. దీంతో వండవ గ్రామ రైతులంతా రైతు, వ్యవసాయ, బ్యాంక్ రుణాలకు దూరమయ్యారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన జగనన్న భూ హక్కు – భూరక్ష పథకంతో రైతులందరికీ మేలు చేకూరింది. వండవ రెవెన్యూ పరిధిలో ఇటీవల జరిగిన రీ సర్వేతో రైతులంతా భూ హక్కుదారులు కానున్నారు. ఇందుకోసం పదేళ్లుగా ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విశేష కృషి చేశారు.

ఇదీ పరిస్థితి....

వీరఘట్టం మండలం వండవ రెవెన్యూ పరిధిలో 1450 ఎకరాల భూములున్నాయి. వీటిలో 150 ఎకరాలు చెరువులు, రోడ్లు, శ్మశానవాటికలు కాగా మిగిలిన 1300 ఎకరాలు రైతులకు చెందిన భూములు. వండవ రెవెన్యూ పరిధిలో వండవ గ్రామ రైతులతో పాటు పాపంపేట, బొడ్లపాడు, తెట్టంగి, శృంగరాయపురం, పాలకొండ మండలం అవలంగి గ్రామాలకు చెందిన 350 మంది రైతుల భూములు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఇనాం భూములు కావడంతో భూముల క్రయ, విక్రయాలు జరగడం లేదు. దీంతో ఒక్క ప్రభుత్వ పథకాన్ని కూడా ఇక్కడి రైతులు పొందలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కళావతి ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లారు. ఎట్టకేలకు ప్రభుత్వం సహకారంతో భూముల సమస్య తీరడంతో ఎమ్మెల్యే కళావతికి రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నెల రోజుల్లో పట్టాదారు పాసు పుస్తకాలు..



బ్రిటిష్ కాలంలో భూములను ఇనాం, ఎస్టేట్ అనే రెండు రకాలుగా విభజించారు. రైతుల వద్ద ఉన్న భూములకు బ్రిటిష్ వారు శిస్తు కట్టించుకునే వారు.ఆ భూములను ఎస్టేట్ భూములని.. ఒకే వ్యక్తి దగ్గర వేల ఎకరాలుంటే వాటికి కూడా శిస్తు కట్టించుకుని ఇనాం భూములుగా పేర్కొన్నారు. మా వంశానికి చెందిన వండవ దొరమాసీ ఆధ్వర్యంలో మా గ్రామం ఉండడంతో ఈ భూములన్నీ ఇనాంగా రికార్డుల్లో నమోదయ్యాయి. మా వంశసస్తులు కాలక్రమేణా ఈ భూములను రైతులకు ఇచ్చినప్పటికీ రికార్డుల్లో మాత్రం ఎటువంటి మార్పు జరగకపోవడంతో నేటికీ ఇనాం భూములుగానే మిగిలిపోయాయి. ఈ క్రమంలో జగనన్న భూరక్ష – భూహక్కు పథకం తీసుకురావడంతో భూముల రీ సర్వే జరిగింది. మరో నెల రోజుల్లో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వస్తాయి.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే, వండవ

ఏళ్ల తరబడి తిరిగాం..



భూములన్నీ మా సాగులో ఉన్నప్పటికీ హక్కుపత్రాలు మాత్రం ఎవ్వరికీ లేవు. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే కళావతి చొరవతో 'జగనన్న భూరక్ష – భూహక్కు' ద్వారా పరిష్కారం లభించింది. త్వరలోనే రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వస్తాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మేలు ఎన్నటికీ మరువలేం.

– కందల వెంకటనాయుడు, రైతు, వండవ

రుణాలు పొందలేదు..



భూములు మా సొంతమే అయినప్పటికీ హక్కుపత్రాలు లేకపోవడంతో ఇంతవరకు ఒక్కసారి కూడా వ్యవసాయ రుణం పొందలేకపోయాం. ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి దయవల్ల అధికారులు కొద్ది రోజుల కిందట రీ సర్వే చేశారు. మరికొద్ది రోజుల్లో మా భూములు మాకు అప్పగించి, పాసు పుస్తకాలు ఇస్తామని అధికారులు చెబుతుండడం ఎంతో ఆనందంగా ఉంది.

– సింగిశెట్టి శ్రీనివాసరావు, రైతు, వండవ

క్షేత్రస్థాయి వరకు ఆర్‌బీకే సేవలు



పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి రైతుల నుంచి రిజిస్ట్రేషన్ సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

పాలకొండ రూరల్: ఆర్‌బీకే సేవలు క్షేత్రస్థాయి వరకు కొనసాగిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని అన్నారు. మండలంలోని లుంబూరు, అంపిలి ఆర్‌బీకేలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు అవసరమగు పచ్చిరొట్ట విత్తనాలతో పాటు వరికి సంబంధించిన విత్తన ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. మండలంలోని 32 పంచాయతీలతో పాటు పట్టణంలో అన్ని ప్రాంతాల రైతులకూ రైతుభరోసా కేంద్రాల ద్వారా సమాచారం అందిస్తున్నామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీకేల్లో సిద్ధం చేయడం జరిగిందని, అవసరమగు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుని విత్తనాలు పొందాలని సూచించారు.

గ్రామాల్లో 144 సెక్షన్

- డీఎస్పీ కృష్ణారావు



తాలాడలో ప్రజలకు సూచనలు చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

భామిని: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి లెక్కింపు పూర్తయిన తర్వాత కూడా 144 సెక్షన్ అమలులో ఉంటుందని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. మండలంలోని లివిరి, బాలేరు, తాలాడ గ్రామాల్లో బుధవారం పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గొడవలకు పాల్పడకూడదని సూచించారు. ఆవేశంలో గొడవలకు దిగితే కేసుల ప్రభావం జీవితాంతం ఉంటుందని చెప్పారు. కార్యక్రమాల్లో సీఐ ఎం. చంద్రమౌళి, బత్తిలి ఎస్సై సీహెచ్ ప్రసాద్, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రిజమ్ –10 కచ్చితంగా అమలు చేయాలి

పాలకొండ రూరల్:

మండలంలో కచ్చితంగా ప్రిజమ్ - 10 కార్యక్రమాన్ని అమలు చేసి ప్రసవ శిశు మరణాల నివారణలో ముందుండాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ప్రిజమ్ - 10 ఎడాప్సన్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గర్భిణీని పర్యవేక్షించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రిజమ్ - 10 సూత్రాలను ఆమలు చేసి సురక్షిత ప్రసవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కమలనాథ్, రవికుమార్, శంకర్, ఐసీడీఎస్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సమయ పాలన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను

సీతానగరం: ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారులు సమయపాలన పాటించాలని, సామాజిక పరమైన పనులకు ప్రాధాన్యమివ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను సూచించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ కృష్ణ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న పనులు, వేతనం గిట్టుబాటు, వేతనదారుల హాజరు తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ మండల వ్యాప్తంగా 11,872 నుంచి 13,234 మంది వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారని, వీరందరూ సమయ పాలన పాటించేలా చూడాలన్నారు. కొలతల ఆధారంగా పనిచేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్రసహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం

- ఏడీఏ మధుసూదనరావు



పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న ఏడీఏ మధుసూదనరావు

పాచిపెంట: పచ్చిరొట్ట ఎరువుతో నేల మరింత సారవంతమవుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదనరావు అన్నారు. పాచిపెంట మండలంలోని కోష్టువలస, మంచాడవలస గ్రామాల రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు బుధవారం పంపిణీ చేశారు. పచ్చిరొట్ట ఎరువుతో భూమికి కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని, పంట దిగుబడికి దోహదపడతాయని తెలిపారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలను జల్లి పూతదశలో కలియదున్నాలన్నారు. కార్యక్రమంలో తిరుపతిరావు, వీఏఏ వినోద్‌కుమార్, మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు, ఎస్‌ఐ నరసింహమూర్తి

మక్కువ: ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం. ఆనందరావు హెచ్చరించారు. మండలంలోని వెంకటభైరిపురం ఇసుక రీచ్‌ను ఎస్‌ఐ నరసింహమూర్తితో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆనందరావు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం చలానా కట్టి ఇసుక తరలించేదుకు అనుమతులు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో ఇసుక అక్రమంగా రవాణా జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టామన్నారు. ఇసుక లోడుతో వాహనాలు దొరికితే సీజ్ చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ స్వాతి, కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన ప్రతీ గిరిజన విద్యార్థికి సీటు ఇవ్వాలి

పార్వతీపురంటౌన్: గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో సీటు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ గిరిజన విద్యార్థికి ప్రవేశం కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్‌లు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో వారు బుధవారం మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఎనిమిది గిరిజన గురుకుల కళాశాలల్లో 1030 సీట్లకు 2,572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సీట్లు పెంచి గిరిజన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని కోరారు. గతంలో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని కొమరాడ గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి పెంచుతామని అధికారులు ప్రకటించినా చర్యలు తీసుకోలేదన్నారు. ప్రతీ సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి (ఏటీడబ్ల్యూఓ) పరిధిలో బాలికలకు రెండు, బాలురకు ఒకటి చొప్పున గిరిజన ఆశ్రమ పాఠశాలలను కళాశాల స్థాయికి పెంచాలని కోరారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన జిల్లాలో ఇంటర్మీడియట్ విద్య అందరికీ అందేలా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బురదనీరు సరఫరాపై నిరసన

పార్వతీపురంటౌన్: వర్షాలు కురిసే సమయంలో కుళాయిల నుంచి బురదనీరు సరఫరా అవుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, పిల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట 12వ వార్డు మేదర వీధి మహిళలతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. అనంతరం డీఈ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పిల్లి ఆరుణ, రమ్య, సరస్వతి, ఎస్. అప్పాయ్యమ్మ, ఆదిలక్ష్మి, కోళ్ల విజయ, సునీత, వెంకటలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు పి. రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

తెర్లాం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని నెమలాం పశువైద్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో ఈ సీజన్‌లో ఎక్కువగా జబ్బువాపు వ్యాధి సోకుతుందని, దీని నివారణకు అవసరమైన టీకాలను పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వేస్తున్నామన్నారు. అలాగే గొర్రెలు, మేకల పెంపకందారులు వారి వద్ద ఉన్న జీవాలకు చిటుకు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని సూచించారు.

ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు: డీఎస్పీ

రామభద్రపురం: ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, కోడ్ ఉల్లంఘించిన, గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు.

విత్తనాల కోసం ప్రతిపాదనలు

బాడంగి: ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేసే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి కె.శిరీష తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. మండలానికి 1300 క్వింటాళ్ల వరకు విత్తనాలు అవసరమని అంచనా వేసినట్లు చెప్పారు. వాటిలో ఎంటీయూ–1121, 1060, సాంబమసూరి, సోనామసూరి, 1224 విత్తన రకాలు పంపించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు.

ఈ నెలాఖరులోగా విత్తనాలు ఆర్‌బీకేలకు చేరుకోనున్నాయన్నారు. రాయితీపై విత్తనాలు కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే ఖరీఫ్‌లో సాగుకు 66.30 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కావాలని ప్రతిపాదనలు పంపించామని, వాటిని 40 శాతం రాయితీపై రైతులకు అందివ్వనున్నట్లు చెప్పారు. మండలంలో ఎరువుల కొరత లేకుండా ముందస్తుగా 324 మెట్రిక్ టన్నుల యూరియా ఆర్‌బీకేలకు తెప్పించి ఉంచామన్నారు. డీఏపీ ఎరువు త్వరలోనే వస్తుందన్నారు. ఆమె వెంట ఏఈఓ పుష్పలత ఉన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండ



బోసిపోయిన సింగిడి మెయిన్ రోడ్డు



భామిని: జనసంచారం లేని నేరడి ప్రధాన వీధి

భామిని/కురుపాం: రోహిణీ కార్తెలో ఎండకు రోళ్లు పగులుతాయని నానుడి. గత రెండు రోజులుగా కాస్తున్న ఎండలు చూస్తే అది నిజమే అనిపించకమానదు. భానుడి భగభగలకు భయపడి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండలకు వేడి గాలులు తోడవడంతో వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. వ్యాపారాలు సాగక వీధివ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ఎండల కారణంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

శతశాతం ఉపాధి పనులు కల్పించాలి

- ఎంపీడీఓ రామకృష్ణ



ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలో 2024 – 25 ఏడాదికి సంబంధించి ఉపాధి వేతనదారులకు శతశాతం పనులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో టెక్నికల్ సహాయకులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న పనులపై పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించారు. ఏపీఓ ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. సగటున రోజుకు రూ. 275 నుంచి 300 రూపాయల వరకు వేతనం గిట్టుబాటయ్యేలా పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా సుమారు 9 వేల మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారన్నారు.

చిత్రలేఖనంపై తర్ఫీదు



కాగితపు, అట్టముక్కలతో బొమ్మలు తయారు చేస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్:

శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ద్వారా విద్యార్థులకు చిత్రలేఖనపై బుధవారం శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి గణేష్‌బాబు నేతృత్వంలో వ్యర్థాలు, అట్టముక్కలతో బొమ్మలు చేసే విధానంపై డ్రాయింగ్ మాస్టర్ మురళి మెలకువలు నేర్పించారు. అనంతరం తెలుగు పద్యాలపై పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించొద్దు

పాలకొండ రూరల్: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ఎటువంటి విఘాతం కలిగించొద్దని సీఐ చంద్రమౌళి అన్నారు. మండలంలోని బాసూరు, ఎల్‌ఎల్ పురం, కోటిపల్లి, తదితర గ్రామాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున ఎటువంటి గొడవలకు పాల్పడరాదని సూచించారు. ఫలితాలు వచ్చేవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.